ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



5 తమిళనాడు TAMILNADU

శుక్రవారం 21 జూన్ 2024

కబళించిన కల్తీసారా...

కన్నీరొలికిన కళ్లకుర్చి

- ఎటు చూసినా ఆర్తనాదాలే
- 39కి పెరిగిన మృతుల సంఖ్య
- మృత్యువుకు చేరువగా 24 మంది
- కలెక్టర్ తప్పుడు సమాచారమే కారణమా?
- సీబీసీఐడీ విచారణ ప్రారంభం
- జస్టిస్ గోకులదాస్‌తో విచారణ సంఘం
- సీబీఐ విచారణకు అన్నాడీఎంకే డిమాండ్

క్రైస్తవ సంప్రదాయంలో మృతదేహాలకు కర్మకాండ



చెన్నై, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): కళ్లకుర్చి జిల్లా కన్నీరొలుకుతోంది.. ఎటు చూసినా రోదనలు, వేదనలు, ఆర్తనాదాలతో ఆ ప్రాంతం శ్మశానాన్ని తలపిస్తోంది. కల్తీసారా తాగి మృతి చెందిన వారి సంఖ్య గురువారం సాయంత్రానికి 39కి చేరడంతో ఆ ప్రాంతం శోకసంద్రంగా మారింది. మృతుల్లో ఐదుగురు మహిళలు కూడా వున్నారు. కళ్లకుర్చి జిల్లా కరుణాపురం పోలీసుస్టేషన్‌కు కూతవేటు దూరంలో కల్తీసారా విచ్చలవిడిగా విక్రయిస్తున్నా పోలీసులుగానీ, ఉన్నతాధికారులుగానీ ఏ మాత్రం పట్టించుకోలేదు. ఫలితంగా యువకులు, వృద్ధులు, మహిళలు వయోభేదం లేకుండా 160 మంది దాకా కల్తీసారా తాగి తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ముందు గా బుధవారం ఉదయం కల్తీసారా తాగిన ముగ్గురు యువకులు మృతి చెందారు. ఆ ముగ్గురు కల్తీసారా తాగి మృతి చెందలేదని జిల్లా కలెక్టర్ తప్పుడు ప్రకటన చేయడంతో బుధవారం మధ్యాహ్నం ఆ ముగ్గురి అంత్యక్రియల్లో పాల్గొనేందుకు వెళ్ళినవారంతా బాధ తట్టుకోలేక మళ్లీ కల్తీసారా తాగారు. దీంతో బుధవారం సాయంత్రానికల్లా 150 మంది తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. తీవ్రమైన వాంతులు, కడుపునొప్పి, కళ్ల మంటలతో ఆస్పత్రి పాలయ్యారు. పరిస్థితి దయనీయంగా మారటంతో వీరందరినీ కళ్లకురిచ్చి, విల్లుపురం, సేలం, పుదుచ్చేరి ఆస్పత్రులకు తరలించి చికిత్సలందించారు. అప్పటికే కల్తీసారా ప్రభావంతో మరికొందరు మృత్యువాతపడ్డారు. ఇలా వరుసగా వడదెబ్బకు గురైన పిట్టల్లా నేలకొరిగారు. కరుణాపురంలోని ఒకే వీధిలో 15 మంది మృతి చెందారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. వీధిలో ఎటు చూసినా షామియానాలు, వాటి కింద మృతదేహాలే కనిపించాయి. కరుణాపురంలో ఒక్కసారిగా మృతుల సంఖ్య పెరగటంతో ఆ ప్రాంతంలో ప్రస్తుతం శవపేటికల కొరత కూడా ఏర్పడింది.

మృతుల సంఖ్య పెరగటానికి కారణమిదేనా...?

కళ్లకురిచ్చిలో కల్తీసారా మృతుల సంఖ్య మధ్యాహ్నానికల్లా పెరగటానికి చావు ఇంటికి వెళ్ళినవారంతా కల్తీసారా తాగటమే కారణమని స్థానికులు చెబుతున్నారు. ఈ విషయమై గ్రామస్థులు మాట్లాడుతూ కరుణాపురంలో ఒకే కుటుంబానికి చెందిన సురేష్, ప్రవీణ్ మాత్రమే కల్తీసారా తాగి కళ్ల మంటలు, వాంతులు చేసుకుని ఆసుపత్రిలో చికిత్స ఫలించక మరణించారని, వారి మృతదేహాలను సుమారు వంద మంది ఆస్పత్రి నుంచి ఊరేగింపుగా వారిళ్ళకు చేర్చారని, ఆ తర్వాత వారి అంత్యక్రియలకు ముందు అందరూ వెళ్లి పోలీసుస్టేషన్ వెనుకవైపు అమ్ముతున్న కల్తీసారా పీకలదాకా తాగి వచ్చారని చెప్పారు. ఇదే విధంగా చావింటికి పరామర్శించేందుకు వెళ్ళినవారు కూడా కల్తీసారా తాగారని, మరికొందరు చావింటివద్ద గుమికూడిన వారికి కల్తీసారా ప్యాకెట్లను కూడా పంపిణీ చేశారని పేర్కొన్నారు. సురేష్, ప్రవీణ్ కల్తీసారా తాగటం వల్లే మృతి చెందారనే విషయం తెలియకుండా వీరంతా కల్తీసారా తాగి అస్వస్థతకు గురై ఆసుపత్రుల పాలయ్యారని వివరించారు.



హిందూ సంప్రదాయ ప్రకారం మృతదేహాలకు అంత్యక్రియలు

24 మంది పరిస్థితి విషమం...

కళ్లకురిచ్చి, పుదుచ్చేరి, సేలం, విల్లుపుం ఆస్పత్రుల్లో ప్రస్తుతం చికిత్స పొందుతున్న వారిలో 24 మంది పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. కళ్లకురిచ్చిలో 25 మంది, పుదుచ్చేరి జిప్మర్‌లో 17 మంది, సేలం ఆస్పత్రిలో 32 మంది, విల్లుపురం ఆస్పత్రిలో ఇద్దరు ఇంకా చికిత్స పొందుతున్నారని అధికారులు పేర్కొన్నారు. సేలం, పుదుచ్చేరి ఆసుపత్రుల్లో తలా ఎనిమిది మంది చొప్పున 16 మంది, కళ్లకురిచ్చిలో ఏడుగురు, విల్లుపురం ఆస్పత్రిలో ఒకరు ప్రాణాపాయస్థితిలో ఉన్నారు.

33 మందికి అంధత్వమేనా?

సేలం ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కల్తీసారా బాధితులలో 33 మంది కంటి చూపు కోల్పోయే అవకాశం ఉందని వైద్యాధికారులు ప్రకటించారు. ప్రస్తుతం ఆస్పత్రిలో 60 మంది వరకు చికిత్స పొందుతున్నారు. వీరిలో 33 మంది తరచూ చూపు మందగించి మూర్ఛిల్లుతున్నారని, ఈ పరిస్థితుల్లో కంటి చూపు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు.

వంటి నొప్పులకు కల్తీసారా తాగి దంపతుల మృతి...

కరుణాపురంలో దంపతులు వంటి నొప్పులకోసం కల్తీసారా తాగి మృత్యువాత పడ్డారు. పోలీసుల విచారణలో ఈ విషయం బహిర్గతమైంది. సురేష్ (40) అనే పెయింటర్, ఆయన భార్య వడివుక్కరసి (32) కలిసి బుధవారం ఉదయం కల్తీసారా తాగారు. కూలీపనులు చేస్తున్న వడివుక్కరసి వళ్లంతా నొప్పులుగా ఉందని చెప్పి భర్తను వెంట బెట్టుకుని వెళ్లింది. ఇద్దరూ కల్తీసారా తాగి ప్రాణాలు కోల్పోయారు.

10 ప్రత్యేక దళాల ఏర్పాటు...

కళ్లకురిచ్చి కల్తీసారా మృతుల సంఘటనపై సీనియర్ పోలీసు అధికారి జీపీ గోమతి నాయకత్వంలో సీబీసీఐడీ విచారణ ప్రారంభించింది. నాలుగు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసుకుని 10 ప్రత్యేక దళాలను రంగంలోకి దింపారు. ఈ సంఘటనకు సంబంధించి నలుగురిని మాత్రమే అరెస్టు చేశారు. ఈ వ్యాపారులకు మెథనాల్ ఎవరు సరఫరా చేశారనే విషయంపై సీబీసీఐడీ విచారణ జరుపుతోంది. కళ్ళకురిచ్చితోపాటు చుట్టుపక్కల జిల్లాల్లోనూ కల్తీసారా వ్యాపారులను అరెస్టు చేసేందుకు గాలింపు చర్యలు కూడా ప్రారంభించారు.

సీబీఐతో విచారణ జరిపించండి

- హైకోర్టులో అన్నాడీఎంకే పిటిషన్

కల్తీసారా విక్రయాలను రాష్ట్ర ప్రభుత్వం నిరోధించలేక పోవడం వల్లే కళ్లకుర్చిలో 39 మంది ఆ విషపూరిత సారాకు బలైపోయారని, ఈ సంఘటనపై సీబీఐ విచారణకు ఉత్తర్వులు జారీ చేయాలని అన్నాడీఎంకే న్యాయవాదులు హైకోర్టు ధర్మాసనానికి విజ్ఞప్తి చేశారు. గురువారం ఉదయం న్యాయమూర్తుల కృష్ణకుమార్, కుమరేష్‌బాబుతో కూడిన ధర్మాసనం ఎదుట అన్నాడీఎంకే న్యాయవాదులు డి.సెల్వం, ఐఎస్ ఇన్బదురై ఈ పిటిషన్ వేశారు. కల్తీసారా సంఘటనపై రాష్ట్ర పోలీసుల విచారణ నిష్పక్షపాతంగా జరగదని, కనుక సీబీఐ విచారణకు ఆదేశించాలని కోరారు. న్యాయమూర్తులు స్పందిస్తూ సీబీఐ విచారణ కోరుతూ సమగ్రమైన వివరాలతో పిటిషన్ వేస్తే విచారణ జరుపుతామని తెలిపారు. ఆ పిటిషన్‌పై శుక్రవారం విచారణ చేపడతామని ధర్మాసనం స్పష్టం చేసింది.

మృతులు వీరే

కల్తీసారాకు మృతిచెందిన వారి వివరాలను ఆయా ఆస్పత్రుల వైద్యాధికారులు ప్రకటించారు. ఆ మేరకు కళ్లకుర్చి, పుదుచ్చేరి జిప్మర్ ఆసుపత్రుల్లో జగదీశన్, కందన్, సురేష్, సెల్వం, ఆరుముగం, నూర్ బాషా, అయ్యావు, మురుగన్, ధనుష్కోడి, గోపాల్, కన్నన్, పూవరసన్ గణేశన్, కుప్పుసామి, లక్ష్మి, జగదీశన్, రామకృష్ణన్, సురేష్, మురుగన్, చిన్న పిళ్లై, కె.నూర్ బాషా, కృష్ణమూర్తి, మణి, ఇందిరా, వడివు, రవి సహా 26 మంది మృతి చెందారు. ఇదే విధంగా సేలం ఆస్పత్రిలో చికిత్సలందుకున్న నారాయణస్వామి, సుబ్రమణి, రాము, ఆనందన్, రవి, విజయన్, మనోజ్‌కుమార్, ఆనందన్, రాజేంద్రన్ అనే తొమ్మిది మంది చికిత్స ఫలించక ప్రాణాలు కోల్పోయారు. ఇదే విధంగా విల్లుపురం ముండియంబాక్కం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సురేష్, ప్రవీణ్, శేఖర్, మణికంఠన్ అనే నలుగురు ప్రాణాలు కోల్పోయారు. దీంతో ఈ దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయినవారి సంఖ్య 39కు చేరింది.





ఆసుపత్రిలో బాధితులు - చికిత్స పొందుతున్న వ్యక్తిని పరామర్శిస్తున్న విజయ్

పుదుచ్చేరి నుంచి మెథనాల్ తరలింపు?

కరుణాపురంలో విక్రయించిన కల్తీసారాలో కలిపిన మెథనాల్ పుదుచ్చేరి నుంచి వ్యాపారులు భారీ స్థాయిలో తరలించి ఉంటారని సీబీసీఐడీ అనుమానిస్తోంది. సారాలో మెథనాల్ కలపటం వల్లే ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమంగా విక్రయిస్తున్న సారా ప్యాకెట్లలో మత్తు అధికంగా వచ్చేందుకు మెథనాల్ కలిపి ఉంటారని తెలిపారు. పుదుచ్చేరికి చెందిన ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకుని ఈ విషయమై విచారణ జరుపుతున్నారు.



అంత్యక్రియల కోసం మృతదేహాలను ఊరేగింపుగా తీసుకెళ్తున్న దృశ్యం



సచివాలయంలో అధికారులతో చర్చిస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్

విచారణకు జస్టిస్ గోకులదాస్ కమిటీ...

కళ్లకుర్చిలో కల్తీసారా మరణాలపై సమగ్రమైన విచారణ జరిపేందుకు హైకోర్టు మాజీ న్యాయమూర్తి పి.గోకులదాస్ నాయకత్వంలో ఏక సభ్య కమిటీని నియమించినట్లు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ప్రకటించారు. కళ్ళకుర్చి కల్తీసారా సంఘటన గురించి సచివాలయంలో గురువారం ఉదయం ఉన్నతాధికారులతో ఆయన సమావేశమయ్యారు. అనంతరం ముఖ్యమంత్రి ఓ ప్రకటన జారీ చేస్తూ కళ్లకుర్చిలో మెథనాల్ కలిపిన కల్తీసారా ఉత్పత్తి చేసినవారిని, ఆ సారాను విక్రయిస్తున్నవారి ఆచూకీ గుర్తించి అరెస్టు చేసి, వారిపై కఠిన చర్యలు తీసుకోమంటూ పోలీసు ఉన్నతాధికారులకు ఆదేశాలిచ్చానని తెలిపారు. మెథనాల్ ఏ ప్రాంతం నుంచి తరలించారనే విషయంపై ప్రత్యేక దృష్టిసారించమని కూడా ఉత్తర్వులిచ్చానని తెలిపారు. విల్లుపురం, కళ్లకుర్చి పుదుచ్చేరి ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నవారికి మెరుగైన చికిత్స అందించమని వైద్య శాఖ ఉన్నతాధికారులకు కూడా ఆదేశించినట్లు తెలిపారు. ఈ సంఘటనపై పరిశీలించేందుకు డీజీపీ శంకర్ జివాల్, హోంశాఖ ప్రధాన కార్యదర్శి అముదాను కూడా కళ్లకురిచ్చికి పంపినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సంఘటనపై హైకోర్టు రిటైర్డ్ జడ్జి గోకులదాస్ విచారణ జరిపి మూడు నెలల్లో ప్రభుత్వానికి నివేదిక సమర్పించనున్నారని సీఎం తెలిపారు.

అవి ప్రభుత్వ హత్యలే

ముందే హెచ్చరించినా చర్యలు శూన్యం ● ప్రతిపక్షం ఆగ్రహం ● స్టాలిన్ రాజీనామా చేయాలని డిమాండ్

ప్యారీస్, జూన్ 20: కళ్లకుర్చిలో జరిగినవి ప్రభుత్వ హత్యలేనని ప్రతిపక్ష నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. కల్తీసారా విషయంపై ఎన్నిమార్లు మొత్తుకున్నా ప్రభుత్వం చేసిన నిర్లక్ష్యం వలనే అంతమంది మృతి చెందారని, అందువల్ల అవి ప్రభుత్వ హత్యలేనని వారు ధ్వజమెత్తారు. పలువురు నేతలు బాధిత కుటుంబాలను పరామర్శించగా, మరికొంతమంది మీడియా ద్వారా తమ ఆవేదన వ్యక్తం చేశారు.

సీఎం రాజీనామా చేయాలి: ఎడప్పాడి డిమాండ్

కళ్లకుర్చి దుర్ఘటనకు నైతిక బాధ్యత వహించి స్టాలిన్ సీఎం పదవికి రాజీనామా చేయాలని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి డిమాండ్ చేశారు. మాజీ మంత్రులు సీవీ షణ్ముగం, డా.సి.విజయ భాస్కర్, అన్నాడీఎంకే స్థానిక నేతలతో కలసి కళ్లకుర్చి ప్రాంతంలోని ప్రభుత్వాసుపత్రికి వెళ్లిన ఎడప్పాడి బాధితులను పరామర్శించారు. అలాగే, కరుణాపురం గ్రామంలో మరణించిన వారి కుటుంబాలను, వారి కుటుంబసభ్యులు, బంధువులను ఎడప్పాడి ఓదార్చారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ... రాష్ట్రంలో 2021వ సంవత్సరం డీఎంకే ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచే శాంతి భద్రతలు క్షీణించాయని, మాదకద్రవ్యాల విక్రయాలు బహిరంగంగా సాగుతున్నాయని విమర్శించారు. కళ్లకుర్చి ప్రాంతంలో పోలీస్‌స్టేషన్ వెనుక కల్తీసారా విక్రయిస్తున్నట్లు గత సోమవారం కళ్లకుర్చి అన్నాడీఎంకే ఎమ్మెల్యే డా.సెంథిల్‌కుమార్ జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశారని, దీనిపై ఎస్పీ ఎలాంటి చర్యలు చేపట్టలేదన్నారు. 39 మంది మరణానికి కారణం ప్రభుత్వం, పోలీసు శాఖదేనని ఆరోపించారు. చెంగల్పట్టు, విల్లుపురం జిల్లాల్లో గత ఏడాది కల్తీ సారా సేవించి మృతిచెందిన సంఘటనపై ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. కల్తీ సారా వ్యవహారంలో నైతిక బాధ్యత వహించి ముఖ్యమంత్రి స్టాలిన్ పదవి నుంచి తప్పుకోవాలని డిమాండ్ చేశారు.



కరుణాపురం గ్రామంలో మృతుడి కుటుంబాన్ని ఓదారుస్తున్న పళనిస్వామి

ముగ్గురు పిల్లలకు అండగా....

కరుణాపురంలో కల్తీ సారా సేవించి సురేష్, వడివి దంపతులు మృతిచెందడంతో వారి ముగ్గురు పిల్లలు అనాథలుగా మిగిలారు. ఈ ముగ్గురు 9 నుంచి ప్లస్ టూ వరకు చదువుకుంటున్నారు. సురేష్ కల్తీ సారా సేవించిన సమయంలో వడివి కూడా తాగడంతో ఇద్దరూ అనారోగ్యానికి గురై మృతిచెందారు. అద్దింట్లో నివసిస్తున్న ఈ దంపతుల మృతదేహాలకు ఎడప్పాడి పళనిస్వామి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా అనాథలైన ముగ్గురు పిల్లలకు తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. పిల్లల చదువుకు అయ్యే ఖర్చు భరించడంతో పాటు ఆ కుటుంబానికి నెలకు పార్టీ తరఫున రూ.5 వేల ఆర్థికసాయం అందజేయనున్నట్లు ఈపీఎస్ ప్రకటించారు.

ఇది ప్రభుత్వ నిర్లక్ష్యమే: నటుడు విజయ్

కళ్లకుర్చి ప్రాంతంలో కల్తీ సారా విక్రయాలను అడ్డుకోకుండా రాష్ట్రప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం వల్లే సుమారు 39 మంది బలయ్యారని తమిళగ వెట్రి కళగం అధ్యక్షుడు, నటుడు విజయ్ ఆరోపించారు. ఆయన తన ఎక్స్ పేజీలో... కళ్లకుర్చి ప్రాంతంలో కల్తీ సారా తాగి 39 మంది మరణించగా, వంద మందికి పైగా ఆసుపత్రుల్లో చికిత్స పొందుతుండడం తనను ఆందోళనకు గురిచేసిందన్నారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేయడంతో పాటు బాధితులు త్వరితగతిన కోలుకోవాలని దైవాన్ని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు.

కళ్లకుర్చి దుర్ఘటన ప్రభుత్వ వైఫల్యమే: టీటీవీ దినకరన్

కళ్లకుర్చి దుర్ఘటన ప్రభుత్వ వైఫల్యమేనని అమ్మ మక్కల్ మున్నేట్ర కళగం (ఏఎంఎంకే) ప్రధాన కార్యదర్శి టీటీవీ దినకరన్ వ్యాఖ్యానించారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ... కల్తీ సారా మరణాలకు సంబంధించి సమగ్ర విచారణ జరిపి అందులో సంబంధాలున్న వారిపై కఠినచర్యలు తీసుకోవాలని దినకరన్ డిమాండ్ చేశారు.

రేపు బీజేపీ ధర్నా : అన్నామలై



బాధితులను పరామర్శిస్తున్న బీజేపీ నేత అన్నామలై

డీఎంకే ప్రభుత్వ నిర్లక్ష్యధోరణిని ఖండిస్తూ శనివారం బీజేపీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించనున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై ప్రకటించారు. కళ్లకుర్చిలోని ప్రభుత్వాసుపత్రికి వెళ్లి చికిత్స పొందుతున్న బాధితులను అన్నామలై పరామర్శించారు. అనంతరం ఆయన మృతి చెందిన వారి కుటుంబీకులను ఓదార్చారు. ఈ సందర్భంగా అన్నామలై మీడియాతో మాట్లాడుతూ... కల్తీ సారా సంఘటనలో బాధిత ప్రజలకు కేంద్ర పథకాల ద్వారా ఆర్థికసాయం అందేలా చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. కల్తీ సారా మృతుల కుటుంబాలకు బీజేపీ తరఫున తలా రూ. లక్ష సాయం ప్రకటించారు. కల్తీ సారా విక్రయాలను నివారించడంలో విఫలమైన మంత్రి ఎస్.ముత్తుస్వామిని పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా రాష్ట్రప్రభుత్వం గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన హామీల్లో ఒకటైన సంపూర్ణ మద్యనిషేధ చట్టాన్ని అమలుపరచాలన్నారు. కళ్లకుర్చి కల్తీ సారా మృతులు, బాధితుల వివరాలను కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా తనను ఫోన్‌లో సంప్రదించి అడిగి తెలుసుకున్నారన్నారు. కళ్లకుర్చిలో జరిగింది ప్రభుత్వ హత్యలేనని, ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం నైతిక బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.

మత్తురహిత తమిళనాడు హామీ ఏమైంది?: ప్రేమలత

మత్తురహిత తమిళనాడు అన్న డీఎంకే ఎన్నికల హామీ ఏమైందని డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలత రాష్ట్రప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. కళ్లకుర్చి ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను ప్రేమలత పరామర్శించారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ... చికిత్స పొందుతున్న వారిలో పలువురి పరిస్థితి విషమంగా ఉందన్నారు. . రాష్ట్రంలో టాస్మాక్ మద్యం దుకాణాలను మూసివేయాలని మహిళలు కోరుతున్నారని తెలిపారు. మత్తురహిత తమిళనాడు తీర్చిదిద్దుతామన్న డీఎంకే ఎన్నికల హామీ ఏమైందని ప్రేమలత ప్రశ్నించారు.

సమాచార దర్శిని

రాష్ట్రపతికి సీఎం జన్మదిన శుభాకాంక్షలు

పెరంబూర్, జూన్ 20: రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము గురువారం 66వ జన్మదినోత్సవం జరుపుకున్నారు. రాష్ట్రపతికి ప్రధాని మోదీ, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా సహా పలు పార్టీల నేతలు శుభాకాంక్షలు తెలిపారు. ఈ నేపథ్యంలో, జన్మదినం జరుపుకుంటున్న ద్రౌపతి ముర్ముకు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు సీఎం తన ఎక్స్ పేజీలో.... రాష్ట్రపతి ద్రౌపతి ముర్ముకు నా జన్మదిన శుభాకాంక్షలు. రాష్ట్రపతి ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకుంటున్నాను అంటూ సీఎం పోస్ట్ చేశారు.

13 నుంచి మదురై అళగర్ ఆలయ ఆడి ఉత్సవాలు

పెరంబూర్, జూన్ 20: మదురై అళగర్ ఆలయ ఆడి ఉత్సవాలు జూలై 13వ తేది ధ్వజారోహణంతో ప్రారంభం కానున్నాయి. ఉత్సవాల్లో ప్రధానాంశమైన రథోత్సవం జూలై 21వ తేది జరుగుతుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

వెటర్నరీ కోర్సుల దరఖాస్తు గడువు పెంపు

పెరంబూర్, జూన్ 20: తమిళనాడు వెటర్నరీ విశ్వవిద్యాలయంలో మొదటి సంవత్సరం అడ్మిషన్లకు సంబంధించిన దరఖాస్తుల స్వీకరణ ఆన్‌లైన్ ద్వారా జరుగుతోంది. ఈ వర్సిటీలో బీటెక్ కోర్సుల అడ్మిషన్లకు దరఖాస్తుల స్వీకరణ గడువు శుక్రవారంతో ముగియనున్న నేపథ్యంలో, ఈ గడువు ఈ నెల 28వ తేది వరకు పొడిగించారు. అదే సమయంలో ప్రవాస భారతీయులు జూలై 5వ తేది వరకు సమర్పించవచ్చు. ఈ నెల 19వ తేది వరకు ఈ కోర్సుల్లో చేరేందుకు 13,978 మంది దరఖాస్తు చేసుకున్నారని, దరఖాస్తులను adm.tanuvas.ac.in అనే వెబ్‌సైట్‌లో సమర్పించాలని వర్సిటీ ఒక ప్రకటనలో తెలిపింది.

నేడు జాబ్ మేళా

ఐసిఎఫ్, జూన్ 20: నగరంలోని ఉద్యోగ అవకాశాలు, వృత్తుల మార్గదర్శక కేంద్రాలు సంయుక్తంగా ప్రైవేటు శాఖల ఎంప్లాయ్‌మెంట్ శిబిరాలు నిర్వహించనున్నాయి. గిండి ఎంప్లాయ్‌మెంట్ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగే ఈ శిబిరంలో 20కి పైగా ప్రైవేటు సంస్థలు పాల్గొని, అభ్యర్థులను ఎంపిక చేయనున్నాయి. ఔత్సాహికులు తగిన సర్టిఫికెట్లతో నేరుగా హాజరుకావాలని అధికారులు తెలిపారు.

కిలంబాక్కం-తిరువళ్లూర్ బస్సు సేవలు ప్రారంభం

ఐసిఎఫ్, జూన్ 20: కిలంబాక్కం-తిరువళ్లూర్ మధ్య బస్సు సర్వీసులు ప్రారంభమయ్యాయి. తిరుముడివాక్కం సిడ్కో, పూందమల్లి బస్టాండ్, తిరుమిళిసై, మలవాళనగర్ ప్రాంతాల మీదుగా ఈ బస్సులు నడుస్తున్నాయి. ఉదయం 5 నుంచి రాత్రి 7 గంటల వరకు కిలంబాక్కం నుంచి 2 గంటలకు ఒక బస్సు, తిరువళ్లూర్ నుంచి ఉదయం 6.45 నుంచి రాత్రి 9 గంటల వరకు 2 గంటలకు ఒక బస్సు నడుపుతున్నట్లు ఎంటీసీ అధికారులుత తెలిపారు.

పౌర్ణమికి 1,435 ప్రత్యేక బస్సులు

ఐసిఎఫ్, జూన్ 20: వారాంతపు సెలవులు, పౌర్ణమిని పురస్కరించుకొని ప్రయాణికుల సౌకర్యార్థం 1,435 ప్రత్యేక బస్సులు నడుపనున్నట్లు ప్రభుత్వ ఎక్స్‌ప్రెస్ రవాణా సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ తెలిపారు. శుక్రవారం పౌర్ణమి, శనివారం, ఆదివారం సెలవులు రావడంతో నగరం నుంచి ఇతర ప్రాంతాలకు, అక్కడి నుంచి నగరానికి, ఆలయాల సందర్శనకు వెళ్లే వారి సౌకర్యార్థం రవాణా సంస్థలు ప్రత్యేక బస్సులు నడుపుతున్నాయి. ఈ క్రమంలో, కిలంబాక్కం నుంచి వివిధ ప్రాంతాలకు శుక్రవారం 600 బస్సులు, శనివారం 410 బస్సులు, కోయంబేడు నుంచి శుక్రవారం 55 బస్సులు, శనివారం 80 బస్సులు, బెంగళూరు వంటి ప్రాంతాలకు 200 బస్సులు నడుపనున్నారు. అలాగే, 30 ఏసీ బస్సులు కిలంబాక్కం నుంచి తిరువణ్ణామలైకు శుక్రవారం నడుపనున్నారు. మొత్తం రాష్ట్ర వ్యాప్తంగా 1,435 ప్రత్యేక బస్సులు నడుపనున్నామని రవాణా శాఖ అధికారులు తెలిపారు.

నేడు తాంబరం-తిరువణ్ణామలై ప్రత్యేక రైలు

పెరంబూర్, జూన్ 20: తిరువణ్ణామలై గిరి ప్రదక్షిణకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం తాంబరం-తిరువణ్ణామలై మధ్య ప్రత్యేక మెము నడుపనున్నట్లు దక్షిణ రైల్వే ప్రకటనలో తెలిపింది. నెం.06127 తాంబరం-తిరువణ్ణామలై పౌర్ణమి గిరివలం స్పెషల్ మెము తాంబరం నుంచి శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలకు బయల్దేరి సాయంత్రం 4 గంటలకు తిరువణ్ణామలై చేరుకుంటుంది. మరుమార్గంలో నెం.06128 తిరువణ్ణామలై-తాంబరం ప్రత్యేక మెము రైలు 22వ తేది ఉదయం 8 గంటలకు తిరువణ్ణామలైలో బయల్దేరి మధ్యాహ్నం 12.30 గంటలకు తాంబరం చేరుకుంటుందని దక్షిణ రైల్వే తెలియజేసింది.

పూర్తిస్థాయిలో మంజలూరు డ్యాం నీటిమట్టం

పెరంబూర్, జూన్ 20: తేని జిల్లాలోని మంజలూరు డ్యాం నీటిమట్టం పూర్తిస్థాయికి చేరుకోవడంతో మూడో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. కొద్ది రోజులుగా జిల్లాలో భారీవర్షాలు కురుస్తుండంతో డ్యాంలోకి నీరు అధికంగా చేరుతోంది. డ్యాం పూర్తి సామర్థ్యం 57 అడుగులు కాగా, ప్రస్తుతం 55 అడుగులకు పైగా నీరు చేరింది. దీంతో, డ్యాం భద్రత దృష్ట్యా 94 ఘనపుటడుగుల నీటిని విడుదల చేస్తున్న ప్రజా పనుల శాఖ అధికారులు, తేని, దిండుగల్ జిల్లాల్లోని తీర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలంటూ మూడవ ప్రమాద హెచ్చరికలు జారీచేశారు.

నగరంలో 339 శాతం అధిక వర్షపాతం

పెరంబూర్, జూన్ 20: నగరంలో ఈ నెల 1 నుంచి 19వ తేది వరకు సాధారణం కన్నా 339 శాతం అధిక వర్షపాతం నమోదైంది. ఈ కాలంలో నగరంలో సరాసరి 36.6 మి.మీ వర్షపాతం నమోదవుతుండగా, ఈ ఏడాది 173.8 మి.మీ వర్షపాతం నమోదైందని ప్రాంతీయ వాతావరణ పరిశోధన కేంద్రం తెలియజేసింది.

ఈబీ ఆఫీసు-కీల్పాక్కం మధ్య అదనపు విద్యుత్ మార్గం

ఐసిఎఫ్, జూన్ 20: స్థానిక అన్నాసాలైలోని ఈబీ ఆఫీసు నుంచి కీల్పాక్కం వరకు అదనపు విద్యుత్ మార్గం ఏర్పాటు చేశారు. నగరంలో కొత్త నిర్మాణాలు, వాణిజ్య సంస్థలతో విద్యుత్ వినియోగం పెరుగుతోంది. దానికనుగుణంగా అదనంగా విద్యుత్ సరఫరా చేసేందుకు కొత్త లైన్లు వేయాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో, కీల్పాక్కంలో ఉన్న 230 కే.వి. ఉప విద్యుత్ కేంద్రానికి 6 కి.మీ దూరంలో ఉన్న ఈబీ కార్యాలయం వరకు విద్యుత్ సరఫరా చేసేలా రూ.30 కోట్లతో కొత్త మార్గాన్ని ఏర్పాటుచేశారు. ఈ మార్గం ద్వారా అదనంగా 200 మెగావాట్ల విద్యుత్ సరఫరా చేయవచ్చని అధికారులు తెలిపారు.

శాసనసభ సమావేశాలు ప్రారంభం

● కల్తీసారా మృతులకు సంతాపం



కళ్లకుర్చి కల్తీసారా మృతులకు నివాళులర్పిస్తున్న సీఎం, ఎమ్మెల్యేలు

చెన్నై, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): కళ్లకుర్చిలో కల్తీ సారా తాగి 30మందికి పైగా మృతువాత పడడంపై రాష్ట్ర శాసనసభ తీవ్ర సంతాపం ప్రకటించింది. శాసనసభ సమావేశాలు గురువారం ఉదయం ప్రారంభమయ్యాయి. ఉదయం 10 గంటలకు ఈ సమావేశానికి సభలో అడుగుపెట్టిన ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌కు పాలకపక్షం సభ్యులు, మంత్రులు స్వాగతం పలికారు. స్పీకర్ అప్పావు మాజీ మంత్రులు, శాసన సభ్యుల మృతికి సంతాప తీర్మానం ప్రతిపాదించారు. మాజీ మంత్రులు ఆర్ఎం వీరప్పన్, ఇందిరాకుమారి, డాక్టర్ రామకృష్ణన్ సహా 17 మంది మాజీ శాసనసభ్యులకు సభ సంతాపం ప్రకటించారు. తరువాత కువైట్‌లో సంభవించిన భారీ అగ్ని ప్రమాదంలో మృతి చెందిన తమిళులకు సంతాపం ప్రకటించారు. ఇక కళ్లకురిచ్చి కరుణాపురంలో కల్తీసారాకు మరణించిన వారికి స్పీకర్ అప్పావు సంతాప తీర్మానం ప్రవేశపెట్టారు. ఆ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కళ్ళకుర్చి వద్ద రసాయనాలు కలిపిన సారా తాగి 30 మందికి పైగా మృతిచెందినట్లు తెలిసి సభ తీవ్ర దిగ్భ్రాంతిని, విచారాన్ని వ్యక్తం చేస్తోందన్నారు. సమాజానికి హాని కలిగిస్తున్న ఇలాంటి నేరాలకు పాల్పడేవారిని శిక్షించేందుకు ప్రభుత్వం వెనుకాడకూడదని చెప్పారు. బాధితులకు అవసరమైన వైద్యం అందించడానికి ప్రత్యేక వైద్య బృందాలను ముఖ్యమంత్రి స్టాలిన్ కళ్లకుర్చికి పంపినట్లు తెలిపారు. ఈ సంఘటనలో ప్రాణాలు కోల్పోయినవారికి, శోకతప్తులైన వారి కుటుంబ సభ్యులకు సభ తీవ్ర విచారాన్ని వ్యక్తం చేస్తోందని, మృతులకు ప్రగాఢ సంతాపం ప్రకటిస్తోందని స్పీకర్ అప్పావు తెలిపారు. స్పీకర్ సంతాప తీర్మానం చదివిన తర్వాత ముఖ్యమంత్రి స్టాలిన్ సహా సభ్యులంతా లేచి కల్తీసారా మృతులకు సంతాపంగా రెండు నిమిషాలపాటు మౌనం పాటించారు. చివరగా విక్రవాండి సిట్టింగ్ ఎమ్మెల్యే పుగళేంది మృతికి సభలో సంతాప తీర్మానం ప్రవేశపెట్టడంతో తొలి రోజు సభ ముగిసింది. ఈ సభా వ్యవహారాలన్నీ పావుగంటలోపు ముగిశాయి. శుక్రవారం నుంచి ఆర్థిక పద్దులపై చర్చలు ప్రారంభం కానున్నాయి. ఈ సమావేశాలు ఉదయం, సాయంత్రం రెండుపూటలా జరుగనున్నాయి.

ఘనంగా తెలుగు బాప్టిస్టు సంఘం స్వర్ణోత్సవం



స్వర్ణోత్సవ వేడుకల్లో పాస్టర్లు ప్రేమ్‌కుమార్, ఫెబ్ ఎడిసన్ తదితరులు

ప్యారీస్, జూన్ 20: స్థానిక కొరుక్కుపేటలోని అనంతనాయకి నగర్ తెలుగు బాప్టిస్టు సంఘం గోల్డెన్ జూబ్లీ వార్షికోత్సవ పునరుజ్జీవన సమావేశాలు ఘనంగా నిర్వహించారు. ఈ నెల 17 నుంచి బుధవారం రాత్రి వరకు వైభవంగా నిర్వహించిన ఈ వేడుకల్లో తొలిరోజు స్త్రీల ఆరాధన సంఘ బోధకురాలు జయమ్మ నేతృత్వంలో జరగగా, దైవసేవకురాలు డా.ఫెబ్ ఎడిసన్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. సంఘకాపరి రెవ.ప్రేమ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన మూడు రోజుల ఉజ్జీవ సభల్లో హైదరాబాద్‌కు చెందిన అల్లూరి సత్యవర్మ దైవసందేశం అందించారు. అలాగే, డీఎస్ గ్రూప్ నిర్వాహకులు పాస్టర్ సౌందరపాండ్యన్ ఆత్మీయ అతిథిగా హాజరై దైవ సేవకులు, సేవకురాళ్లను సత్కరించారు. సంఘ నాయకులు జేపీ బాబు, ప్రేమ్‌కుమార్, రమేష్, శ్రీనివాస్, జస్టిన్, చిరంజీవి, ఏలియా తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ అధ్యక్షుడిగా మాజీ న్యాయమూర్తి ఎస్.మణికుమార్

పెరంబూర్, జూన్ 20: రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ అధ్యక్షుడిగా మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎస్.మణికుమార్ నియమితులులయ్యారు. నగరంలోని డా.అంబేద్కర్ న్యాయకళాశాలలో లా కోర్సు పూర్తిచేశారు. రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ అధ్యక్షుడిగా వ్యవహరించిన భాస్కర్ పదవీ విరమణ పొందిన నేపథ్యంలో, కేరళ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పదవీ విరమణ పొందిన రాష్ట్రానికి చెందిన ఎస్.మణికుమార్‌ను నియమిస్తూ గవర్నర్ ఆర్ఎన్ రవి ఉత్తర్వులు జారీచేశారు. ఇదివరకే ఎస్.మణికుమార్ మద్రాసు హైకోర్టు సీనియర్ న్యాయమూర్తిగా పనిచేశారు. అనంతరం ఆయన కేరళ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియమితులయ్యారు. అక్కడ పదవీవిరమణ పొందిన అనంతరం రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ అధ్యక్షుడిగా ఆయను పేరు సిఫారసు చేశారు. ఆయన మూడేళ్ల పాటు ఈ పదవిలో కొనసాగనున్నారు. ఆయనతో పాటు ఇప్పటికే మద్రాసు హైకోర్టు న్యాయమూర్తిగా పనిచేసి పదవీవిరమణ చేసిన రాజా ఇళంగో, న్యాయవాది కన్నదాసన్ తదితరులు కమిషన్ న్యాయమూర్తులుగా ఉన్నారు.

లక్ష రాబిస్ టీకాల నిల్వలు

ఐసిఎఫ్, జూన్ 20: రాష్ట్రంలో రాబిస్ నిరోధక టీకాలు లక్ష వరకు నిల్వ ఉన్నట్లు ఆరోగ్యశాఖ అధికారి డా.వడివేలన్ తెలిపారు. ఈ సంవత్సరం పిచ్చికుక్కల కరచి 16 మంది రాబిస్ వ్యాధికి గురై మృతిచెందారు. పెంపుడు జంతువులకు రాబిస్ రాకుండా టీకాలను పుట్టిన ఏడాదిలో రెండు సార్లు వేస్తుంటారు. అనంతరం ప్రతి ఏటా ఒక టీకా తప్పనిసరిగా వేయించాల్సి ఉంటుంది. అయితే వీధి శునకాలకు ఈ టీకాలు సక్రమంగా వేయకపోవడంతో అవి ప్రజలపై దాడికి పాల్పడినప్పుడు ఈ వ్యాధికి గురయ్యే అవకాశాలున్నాయి. గత ఏడాది 22 మంది కుక్క కాటు వల్ల మృతిచెందగా, ఈ ఏడాది ఇప్పటివరకు 16 మంది మృతి చెందారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా లక్ష రాబిస్ నిరోధక టీకాలు నిల్వలున్నాయని ఆరోగ్యశాఖ అధికారి వడివేలన్ తెలిపారు.

3.50 టీఎంసీలకు తగ్గిన కావేరి ఇన్‌ఫ్లో

ఐసిఎఫ్, జూన్ 20: కావేరి ఇన్‌ఫ్లో 3.50 టీఎంసీలకు తగ్గింది. రాష్ట్రానికి ప్రతి ఏటా 177.25 టీఎంసీల కావేరి జలాలను కర్ణాటక ప్రభుత్వం విడుదల చేయాల్సి ఉంది. జూన్‌లో 9.19 టీఎంసీలు నీరు విడుదల చేయాలి. ఈ నెల 17వ గణాంకాల ప్రకారం 5.20 టీఎంసీల నీరు రావాల్సి ఉండగా, 1.65 టీఎంసీలు మాత్రమే వచ్చింది. ఇంకా 3.50 టీఎంసీల నీరు రావాల్సి ఉంది. కర్ణాటకలో కురుస్తున్న వర్షాలకు అక్కడున్న డ్యాంల్లో ఇన్‌ఫ్లో పెరిగినా అక్కడి ప్రభుత్వం నీరు విడుదల చేయకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

రాష్ట్రప్రభుత్వాల ఆధీనంలో ప్రవేశ పరీక్షలు

● కేంద్ర మాజీ మంత్రి పి.చిదంబరం

పెరంబూర్, జూన్ 20: వైద్యకోర్సుల ప్రవేశానికి నిర్వహించే 'నీట్' సహా అన్ని పరీక్షలు రాష్ట్ర ప్రభుత్వాల ఆధీనంలో జరగాలని కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ కేంద్ర మంత్రి పి.చిదంబరం డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన తన ఎక్స్ పేజీలో... ఇటీవల జరిగిన నీట్ పరీక్షల్లో భారీ అవినీతి జరిగిందన్నారు. ఇలాంటి అవినీతితో విద్యార్థుల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారే పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ఇలాంటి అవకతవకలు అరికట్టేలా అన్ని ప్రవేశపరీక్షలు రాష్ట్రప్రభుత్వాలు నిర్వహించేలా చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

విక్రవాండి ఉప ఎన్నికకు పరిశీలకుల నియామకం

పెరంబూర్, జూన్ 20: విక్రవాండి ఉప ఎన్నికకు సంబంధించిన ఎన్నికల పరిశీలకులను నియమిస్తూ కేంద్ర ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీచేసింది. ఆ ప్రకారం, ఉప ఎన్నికల పరిశీలకులుగా ఐఏఎస్ అధికారి అమిత్‌సింగ్ బన్సాల్, వ్యయ పరిశీలకులుగా ఐఆర్ఎస్ అధికారి మనీష్‌కుమార్ మీనా నియమితులయ్యారు.

ఎక్స్‌ప్రెస్ రైళ్ల వేళల్లో మార్పులు

ఐసిఎఫ్, జూన్ 20: ఏడు ఎక్స్‌ప్రెస్ రైళ్ల వేళల్లో మార్పులు జరిగినట్లు దక్షిణ రైల్వే తెలిపింది.

- కర్ణాటక రాష్ట్రం యశ్వంత్‌పూర్-చెన్నై సెంట్రల్ రాత్రి 10.45 గంటల రైలు శుక్రవారం సెంట్రల్‌కు బదులుగా చెన్నై బీచ్ రైల్వేస్టేషన్ వరకే వస్తుంది.
- కోయంబత్తూర్-సెంట్రల్ రాత్రి 11.30 గంటల రైలు సెంట్రల్‌కు బదులుగా శుక్రవారం బీచ్ స్టేషన్‌కు చేరుతుంది.
- కేరళ రాష్ట్రం అలెప్పి-సెంట్రల్ మధ్యాహ్నం 3.20 గంటల రైలు 25వ తేది వరకు ఆవడి వరకు మాత్రమే నడుస్తుంది.
- కోయంబత్తూర్-సెంట్రల్ మధ్యాహ్నం 3.15 గంటల రైలు 26వ తేది వరకు పెరంబూర్ వరకు మాత్రమే నడువనుంది.
- ఆంధ్ర రాష్ట్రం సాయి బి స్టేషన్-చెన్నై రాత్రి 7 గంటల రైలు సెంట్రల్‌కు బదులుగా శనివారం చెన్నై బీచ్ స్టేషన్‌కు వస్తుంది.
- కేఎస్ఆర్ బెంగుళూరు- బిహార్ రాష్ట్రం ధానాపూర్ ఉదయం 7.50 గంటల రైలు 24వ తేది పెరంబూర్ వచ్చి తిరిగి వెళ్లనుంది.
- సెంట్రల్-హౌరా ఎక్స్‌ప్రెస్ రైలు 26వ తేది ఉదయం 7 గంటలకు బదులుగా 1 గంట 45 నిముషాలు ఆలస్యంగా 8.45 గంటలకు బయల్దేరనుంది.

హజ్ యాత్రలో మృతిచెందిన తమిళులకు సౌదీలోనే అంత్యక్రియలు

● మంత్రి సెంజి మస్తాన్

పెరంబూర్, జూన్ 20: హజ్ యాత్ర సమయంలో మృతిచెందిన నలుగురు తమిళుల మృతదేహాలకు సౌదీలోనే అంత్యక్రియలు నిర్వహించేందుకు వారి కుటుంబసభ్యులు అంగీకారం తెలిపారని ప్రవాస తమిళుల సంక్షేమ శాఖ మంత్రి సెంజి మస్తాన్ తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఇస్లామీయులు ప్రతి ఏడాది హజ్ యాత్ర చేపడుతుంటారు. ఆ ప్రకారం ఈ ఏడాది హజ్ యాత్ర ఈ నెల 14న ప్రారంభమైంది. త్యాగాలను స్మరించుకొనేలా సౌదీ అరేబియాలోని పుణ్యనగరమైన మక్కాకు ఈ ఏడాది 18 లక్షల మంది వెళ్లారు. ఆధ్యాత్మిక యాత్రకు వచ్చిన వారిలో ఎండవేడి కారణంగా 922 మంది మృతిచెందినట్లు సమాచారం. భారత్ నుండి 1.75 లక్షల మంది హజ్ యాత్రకు వెళ్లగా, వారిలో ఇప్పటివరకు 80 మంది మృతిచెందినట్లు తెలిస్తోంది. ఈ విషయమై రాష్ట్ర మంత్రి సెంజి మస్తాన్ తన ఎక్స్ పేజీలో... రామనాథపురానికి చెందిన రసిక్కబీవి (73), తిరునల్వేలికి చెందిన షైదీన్‌పాత్తు (73), నగరానికి చెందిన నజీర్ అహ్మద్ (40), కరూర్‌కు చెందిన లియాఖత్ అలి (72) తదితరులు గుండె సంబంధిత సమస్యల కారణంగా హజ్ యాత్రకు వెళ్లిన సమయంలో, మక్కా, అరాఫత్, మీనా తదితర ప్రాంతాల్లో మృతిచెందారని తెలిపారు. మృతిచెందిన వారికి సౌదీలోనే అంత్యక్రియలు నిర్వహించేందుకు వారి కుటుంబసభ్యులు అంగీకారం తెలిపారు.

ఏనుగు దంతాలతో ఇద్దరి అరెస్ట్



ఏనుగుల దంతాలతో నిందితులు

పెరంబూర్, జూన్ 20: ధర్మపురి జిల్లా కారిమంగళం ప్రాంతంలో కారులో ఏనుగు దంతాలు తరలిస్తున్న ఇద్దరిని అటవీ శాఖ అధికారులు అరెస్ట్ చేశారు. అటవీ శాఖ అధికారులకు అందిన సమాచారం మేరకు కారిమంగళం ప్రాంతం లో గస్తీ చేపట్టారు. ఆ సమయంలో అటువైపు వచ్చిన కారును ఆపి పరిశీలించి, అందు లో రెండు ఏనుగు దంతాలను స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్ట్ చేశారు. వారిచ్చిన సమాచారంతో, ఏనుగును తుపాకితో కాల్చి చంపి దంతాలు పెకలించిన వ్యక్తి కోసం అధికారులు గాలిస్తున్నారు.

పేర్నాంబట్టులో జమాబందీ



దివ్యాంగుల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి

వేలూరు, జూన్ 20: జిల్లాలోని ఆరు డివిజన్లలో 1433 పసలి సంవత్సర జమాబందీ బుధవారం ప్రారంభమైంది. రెండవ రోజు పేర్నాంబట్టులో గురువారం జరిగిన జమాబందీలో కలెక్టర్ సుబ్బులక్ష్మి పాల్గొని, దివ్యాంగుల నుంచి వినతులు స్వీకరించా రు. కలెక్టర్ వెంట సమూహ భద్రత శాఖ అధికారి కలియమూర్తి, పేర్నాంబట్టు తహసీల్దార్ వినాయకమూర్తి, అధికారులు పాల్గొన్నారు.

మాస్ ఉపాధ్యక్షుడు కన్నుమూత



వెంకటేశ్వర్లు (ఫైల్‌ఫొటో)

ప్యారీస్, జూన్ 20: మద్రాసు ఆది ఆంధ్రా అరుంధతీయ ఆదివాసీ సంక్షేమ సంఘం (మాస్) ఉపాధ్యక్షుడు కె.వెంకటేశ్వర్లు (72) బుధవారం అనారోగ్యంతో కన్నుమూశారు. వేళచ్చేరి కాసా బ్లాంకా గృహంలో ఆయన తుదిశ్వాస విడిచారు. గురువారం వేళచ్చేరిలోని శ్మశాన వాటికలో అంత్యక్రియలు జరిగాయి. ఎస్‌బీఐ రిటైర్డ్ ఏజీఎం వెంకటేశ్వర్లు మాస్ ఉపాధ్యక్షుడిగా సేవలందించారు. ఆయన మృతికి మాస్ అధ్యక్షులు డాక్టర్ కొల్లిరాజు, ఇతర నిర్వాహకులు తీవ్ర సంతాపం ప్రకటించారు.

కళాశాలల తరగతులు ప్రారంభం

పెరంబూర్, జూన్ 20: రాష్ట్రవ్యాప్తంగా ఆర్ట్స్ అండ్ కళాశాలల్లో బుధవారం నుంచి తరగతులు ప్రారంభమయ్యాయి. సెమిస్టర్ పరీక్షల అనంతరం కళాశాలలకు వేసవి సెలవులు ప్రకటించారు. ఈ నేపథ్యంలో, సెలవు ముగిసిన బుధవారం నుంచి రెండు, మూడవ సంవత్సరం తరగతులు ప్రారంభమయ్యాయి. మొదటి సంవత్సరం అడ్మిషన్లు ముగించి, జూలై మొదటి వారంలో తరగతులు ప్రారంభించనున్నట్లు కళాశాల విద్య డైరెక్టరేట్ తెలిపింది.

25, 26 తేదీల్లో జమాబందీ

ఐసిఎఫ్, జూన్ 20: చెన్నై జిల్లా పరిధిలోని షోలింగనల్లూర్, ఆలందూర్, అంబత్తూర్, మాధవరం, మధురవాయల్, తిరువొత్తియూర్ తాలూకాల్లో ప్రజల సమస్యలు పరిష్కరించేలా ఈ నెల 25,26 తేదీల్లో జమాబందీ జరుగనుంది. ఆయా తహసీల్దార్ కార్యాలయాల్లో ఉదయం 9 గంటల నుంచి శిబిరాలు ప్రారంభం కానున్నాయి. ఆ ప్రాంత ప్రజలు పట్టాలు, ఇతర వినతిపత్రాలు అందజేసి తమ సమస్యలకు పరిష్కారం పొందవచ్చని చెన్నై జిల్లా కలెక్టర్ రష్మి సిద్ధార్థ్ తెలిపారు.

విజయకరిసల్‌కుళంలో బయల్పడిన పూసల దండలు



విరిగిన బంక మట్టి బొమ్మ, గాజు పూసలు, తూనికరాయి

ఐసిఎఫ్, జూన్ 20: విరుదునగర్ జిల్లా విజయకరిసల్‌కుళంలో చేపట్టిన పురావస్తు తవ్వకాల్లో బంకమట్టి బొమ్మలు, గాజు పూసలు, తూనిక రాళ్లు బయల్పడ్డాయి. మంగళవారం తొలివిడతగా మూడు చోట్ల తవ్వకాలు జరిగాయి. బుధవారం 20కి పైగా గాజు పూసలు, ప్రాచీన ఇటుకరాళ్లు, బంకమట్టి బొమ్మలు, ప్రాచీన తూనికరాళ్లు లభించాయి. ఈ ప్రాంతంలో పూర్వకాలంలోనే ఇటుక కట్టడాలున్నాయని పురావస్తు శాఖ డైరెక్టర్ భాస్కర్ పొన్నుస్వామి తెలిపారు.

కాలయార్ ఆలయంలో శిలా వలయాలు

శివగంగ జిల్లా కాలయార్ ఆలయంలో శిలా వలయాలను పరిశోధకులు కనుగొన్నారు. ఈ ఆలయం సమీపంలో పరిశోధనలు జరుగుతున్నాయి. వాగైకులం నల్లేందల్ నది లోయలో 20 ఎకరాల్లో 50కి పైగా స్థలాల్లో పూర్వీకుల సమాధులు గుర్తించారు. ఇవి 2600 నుంచి 4000 ఏళ్లనాటివని తెలిపారు. ఒకే స్థలంలో ఐదు వరుసలుగా పేర్చి మట్టి బానల్లో అస్థిపంజరాలను చరిత్ర పరిశోధకులు కనుగొన్నారు. వీటితో పాటు ఇనుప పనిముట్లు, సున్నపురాళ్లు, నలుపు ఎరుపు కుండ పెంకులు, శిలా వలయాలు వంటివి లభ్యమయ్యాయి.

మందలించిన తండ్రి.. విద్యార్థిని ఆత్మహత్య

పెరంబూర్, జూన్ 20: సెల్‌ఫోన్ ఎక్కువగా మాట్లాడడం తగ్గించాలని తండ్రి మందలించడంతో విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన వ్యాసర్పాడిలో చోటుచేసుకుంది. సత్యమూర్తి నగర్ జేజేఆర్ నగర్‌కు చెందిన సౌందర్-అరుణ దంపతులకు తమిళ్‌సెల్వి (14), రిషిక (13) అనే కుమార్తెలున్నారు. 9వ తరగతి చదువుతున్న రిషిక మంగళవారం రాత్రి ఇంటి ముందు నిలబడి సెల్‌ఫోన్‌లో మాట్లాడడాన్ని గమనించిన తండ్రి, ఆ సమయంలో ఎవరితో మాట్లాడుతున్నావని మందలించాడు. బుధవారం ఉదయం తల్లిదండ్రులు పనికి వెళ్లగా, బడికి వెళ్లకుండా ఇంట్లో ఒంటరిగా ఉన్న రిషిక ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటనపై ఎంకేబీ నగర్ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

చోరీలకు పాల్పడిన 39 మంది అరెస్ట్

పెరంబూర్, జూన్ 20: నగరంలో వివిధ ప్రాంతాల్లో ద్విచక్రవాహనాలు, చైన్ స్నాచింగ్‌లకు పాల్పడిన 39 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. నగరంలో అధికమవుతున్న నేరాలను అరికట్టేందుకు పోలీస్ కమిషనర్ సందీప్ రాయ్ రాథోడ్ 'డ్రైవ్ ఎగనెస్ట్ క్రైమ్ అఫెండర్స్ (డీఏసీఓ)' పేరిట గస్తీ కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఆ బృందాలు ఈ నెల 13 నుంచి 19వ తేది వరకు సెల్‌ఫోన్లు, బంగారం తదితర చోరీలకు సంబంధించి 26 కేసులు నమోదుచేసి ఆరుగురు మైనర్లు సహా 34 మందిని అరెస్ట్ చేశారు. వారి నుంచి 65 గ్రాముల బంగారు ఆభరణాలు, 80 గ్రాముల వెండి ఆభరణాలు, 8 సెల్‌ఫోన్లు, రూ.72,71,521 నగదు, రూ.2 లక్షల విలువైన ఫర్నిచర్, రెండు కారు బ్యాటరీలు స్వాధీనం చేసుకున్నారు. అలాగే, ఆటోమొబైల్ వాహనాల చోరీలకు సంబంధించి ఆరు కేసులు నమోదుచేసి ఐదుగురిని అరెస్ట్ చేసి, 6 మోటార్ సైకిళ్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ ప్రకారం, ఈ ఏడాది జనవరి 1 నుంచి ఈ నెల 19వ తేది వరకు దోపిడీలు, చైన్ స్నాచింగ్‌లకు పాల్పడిన 118 మందిని గూండా చట్టం కింద అరెస్ట్ చేసినట్లు నగర పోలీసు శాఖ గురువారం ప్రకటన విడుదల చేసింది.

పైన్‌సోల్ ప్రాంతంలో పులి సంచారం

పెరంబూర్, జూన్ 20: నీలగిరి జిల్లా ఊటీ తలైకుంద సమీపం పైన్‌సోల్ ప్రాంతంలో పులి సంచరిస్తున్నట్లు అటవీ శాఖ అధికారులు గుర్తించారు. దీంతో, గురువారం ఉదయం ఆ ప్రాంతానికి వచ్చిన పర్యాటకులను అటవీ శాఖ సిబ్బంది అక్కడి నుంచి పంపించేశారు. రెండు రోజులు ఈ పర్యాటక కేంద్రానికి తాత్కాలికంగా మూసివేసి, పులి సంచారాన్ని పర్యవేక్షిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

విద్యార్థినిపై లైంగిక వేధింపులు... నిందితుడికి 22 ఏళ్ల జైలు

పెరంబూర్, జూన్ 20: కన్నియాకుమారి జిల్లా కొల్లంగోడు ప్రాంతంలో విద్యార్థినిపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఘటనలో యువకుడికి 22 ఏళ్ల జైలుశిక్ష విధిస్తూ న్యాయస్థానం ఉత్తర్వులు జారీచేసింది. 2016లో ప్లస్ టూ చదువుతున్న విద్యార్థినిని ప్రేమపేరుతో నమ్మించి ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడనే కేసులో అభిన్ విజయ్ అనే యువకుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసు విచారణ ముగియడంతో, నిందితుడు విజయ్‌కు 22 ఏళ్ల జైలు, రూ.5,500 జరిమానా విధిస్తూ నాగర్‌కోయిల్ మహిళా న్యాయస్థానం గురువారం తీర్పు వెలువరించింది.

నాటుబాంబులతో ఇద్దరు రౌడీల అరెస్ట్

ప్యారీస్, జూన్ 20: స్థానిక అరుగంబాక్కం, పట్టాభిరాం ప్రాంతాలకు చెందిన ఇద్దరు రౌడీలను అరెస్ట్ చేసిన గ్రేటర్ చెన్నై పోలీసులు, వారి నుంచి నాలుగు నాటుబాంబులు, మారణాయుధాలు స్వాధీనం చేసుకున్నారు. కిరాయి ముఠాలకు చెందిన వారు మారణాయుధాలతో సంచరిస్తున్నారని నార్త్ జోన్ పోలీసులకు అందిన సమాచారంతో మారువేషాలలో తనిఖీ నిర్వహించారు. ఇందులో అరుంబాక్కం ప్రాంతానికి చెందిన పేరుమోసిన రౌడీ సురేష్ (30), పట్టాభిరాంకు చెందిన రౌడీ శంకర్‌లను బుధవారం అదుపులోకి తీసుకొని, వారి నుంచి నాలుగు నాటుబాంబులు, నాలుగు కత్తులు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

కల్తీసారా మరణాలు రాష్ట్రానికి అలవాటే !

ప్యారీస్, జూన్ 20: రాష్ట్రంలో కల్తీ సారా మరణాలపై కేంద్ర హోం మంత్రిత్వ శాఖ, జాతీయ రికార్డులు భద్రపరిచే సంస్థలు నిర్వహించిన సర్వే వివరాలను గురువారం వెల్లడించాయి. ఆ రీతిలో తమిళనాడులో 23 ఏళ్ళ క్రితం 2001వ సంవత్సరం కడలూరు జిల్లా బన్రూట్టిలో కల్తీ సారా తాగి 53 మంది మృత్యువాతపడ్డారు. 2001లో తిరువళ్లూర్ జిల్లా రెడ్‌హిల్స్ సమీపంలోని కొట్బూరు, పరిసర ప్రాంతాల్లో కల్తీ సారాకు 30 మందికి పైగా మరణించారు. 2020లో మరో 20 మంది మరణించగా, 2021లో ఆరుగురు బలయ్యారు. ఇక, 2023వ సంవత్సరం విల్లుపురం జిల్లా మరక్కాణం, చెంగల్పట్టు జిల్లా మధురాంతకం ప్రాంతాల్లో చట్టవిరుద్ధంగా విక్రయించిన కల్తీ సారా తాగి 21 మంది మృతిచెందారు. ప్రస్తుతం కళ్లకుర్చిలో కల్తీ సారా తాగి బుధ, గురువారాల్లో 39 మందికి పైగా మరణించగా, ఆసుపత్రిలో చేరి చికిత్సలందుకున్న బాధితుల్లో మరి కొందరి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు.

నాగాలాండ్ రిజిస్ట్రేషన్ ఆమ్నీ బస్సు స్వాధీనం

ప్యారీస్, జూన్ 20: చెంగల్పట్టు జిల్లా భరనూరు టోల్‌గేట్‌లో వాహనాల తనిఖీ చేసిన ఆర్టీఏ అధికారులు నాగాలాండ్ రిజిస్ట్రేషన్‌తో ఉన్న ఆమ్నీ బస్సును గురువారం స్వాధీనం చేసుకున్నారు. రాష్ట్రంలో పొరుగు రాష్ట్రాల రిజిస్ట్రేషన్ నెంబరు కలిగిన వాహనాలు నడిపేందుకు ప్రభుత్వం నిషేధం విధించింది. అయినప్పటికీ, నగరం నుంచి పలు దక్షిణ జిల్లాలకు ప్రతిరోజు వెయ్యికి పైగా ప్రైవేటు ఆమ్నీ బస్సులు నడుపుతుండగా, వాటిలో పొరుగు రాష్ట్రాల్లో రిజిస్టర్ చేసుకున్నవి ఉన్నాయంటూ ఆర్టీఏ శాఖకు సమాచారం తెలిసింది. దీంతో చెంగల్పట్టు సమీపంలో ఉన్న భరనూరు టోల్‌గేట్‌లో బుధవారం రాత్రి నుంచి గురువారం ఉదయం వరకు తనిఖీ చేసిన అధికారులు, నాగాలాండ్ రిజిస్టర్‌తో ఉన్న ఆమ్నీ బస్సును స్వాధీనం చేసుకొని కేసు నమోదుచేశారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏసీబీ తనిఖీలు

● రూ.2.14 లక్షల స్వాధీనం



తనిఖీల్లో ఏసీబీ అధికారులు

వేలూరు, జూన్ 20: స్థానిక కాట్పాడి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అవినీతి నిరోధక శాఖ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. బుధవారం సాయంత్రం నుంచి అర్ధరాత్రి వరకు నిర్వహించిన తనిఖీల్లో లెక్కల్లో చూపని రూ.2.14 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. ఈ కార్యాలయంలో స్థలాల క్రయ విక్రయాలు, వివాహ రిజిస్ట్రేషన్ తదితరాలకు అధికారులు, సిబ్బంది లంచం తీసుకుంటున్నారని అవినీతి నిరోధక శాఖకు ఫిర్యాదులందాయి. ఈ నేపథ్యంలో, ఏసీబీ సూపరింటెండెంట్ శంకర్ నేతృత్వంలో ఇన్‌స్పెక్టర్ విజయ్ సహా ఏడుగురు ఈ తనిఖీల్లో పాల్గొన్నారు. తనిఖీల్లో రూ.2.14లక్షలు స్వాధీనం చేసుకున్న అధికారులు, సబ్ రిజిస్ట్రార్ నిత్యానందం సహా పలువురు ఉద్యోగులను విచారిస్తున్నారు.

మురుగునీరు కలవడంతో చనిపోతున్న చేపలు



ఐసిఎఫ్, జూన్ 20: స్థానిక మెరీనా సముద్రంలో మురుగునీరు, రసాయనాలు కలవడంతో చేపలు మృతిచెంది తీరానికి కొట్టుకొస్తున్నాయి. నగరంలో పలు వర్షపు నీటికాలువలు అడయార్ నదితో అనుసంధానం చేశారు. అయితే ఈ కాలువల్లో సంవత్సరం పొడవునా మురుగునీరే ప్రవహిస్తోంది. దీంతో నదిలో వ్యర్థాలు కలిసి కలుషితమవుతోంది. అంతేకాకుండా నగరం, శివారు ప్రాంతా ల అభివృద్ధి, అడయార్ నదీ తీర ప్రాంతాల్లో వాణిజ్య కేంద్రాలు పెరగడం, ఆక్రమణల కారణాలతో పలుచోట్ల మురుగునీరు, రసాయనాలు విడుదలై సముద్రంలో కలుస్తోంది. ఈ నేపథ్యంలో, బుధవారం ఉదయం చేపలు మృతిచెంది తీరానికి కొట్టుకొచ్చాయి. ఈ విషయమై సంఘ శ్రేయోభిలాషులు మాట్లాడుతూ... సముద్రంలో మురుగునీరు కలువడం వల్ల ఆక్సిజన్ పరిమాణం తగ్గి చేపలు మృతిచెందుతున్నాయని, అంతేకాకుండా సముద్రానికి వచ్చే ప్రజలు విసిరే ఆహార పదార్థాలను తినే చేపలు అలర్జీ కారణంగా మరణిస్తున్నాయని కూడా పేర్కొన్నారు. సముద్రం కలుషితం కాకుండా ఉండేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.



సామూహిక అంత్యక్రియల కోసం సిద్ధం చేస్తున్న సమాధులు



తమ తల్లిదండ్రుల మృతదేహాలపై పూలమాల వేసి నివాళులర్పిస్తున్న చిన్నారులు



తమ వారి మృతదేహాల వద్ద రోదిస్తున్న కుటుంబీకులు

కళ్లకుర్చిలో బుధవారం ఇద్దరు యువకులు సారా తాగి అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించగా, వారి అంత్యక్రియల కోసం వచ్చిన వందలాది మంది మృతుల ఇంటికి సమీపంలో అమ్ముతున్న కల్తీ సారా తాగి అస్వస్థకు గురయ్యారు. దీంతో చావు ఇంటికి వచ్చినవారిలో దాదాపు 39 మంది మృతువాత పడగా, ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నవారిలో మరికొందరి పరిస్థితి విషమంగా ఉంది.

ఈ శోకం తీరేదెలా?

● శ్మశానంలా కరుణాపురం ● సామూహిక అంత్యక్రియలు

చెన్నై, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): కళ్లకుర్చి జిల్లా కరుణాపురంలో కల్తీసారా మృతుల సంఖ్య ఉన్నట్టుండి పెరగడానికి ఆ జిల్లా మాజీ కలెక్టర్ తప్పుడు ప్రకటనే కారణమని ఆ ప్రాంతానికి చెందిన ఓ మహిళ పేర్కొన్నారు. ఆమె మీడియాతో మాట్లాడుతూ.. బుధవారం ఉదయం ముగ్గురు యువకులు కల్తీసారా తాగి మృతి చెందితే కలెక్టర్ ఏ విచారణ జరుపకుండా తనకుతానుగా ఆ యువకులు కల్తీసారాకు మృతి చెందలేదని ప్రకటించడంతో పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. బుధవారం ఉదయం 6 గంటలకు కల్తీసారా తాగిన సురేష్ అనే యువకుడు మృతి చెందాడని, కాసేపటికి ప్రవీణ్ అనే యువకుడు కూడా మృతి చెందాడని, వారికి చికిత్స జరిపిన వైద్యులు ఎలాంటి కారణాలు చెప్పకుండా మృతదేహాలను పంపించేశారన్నారు అయితే వారిద్దరూ కల్తీసారా తాగటం వల్లే మృతిచెందినట్లు ఉదయం 11 గంటలకల్లా తమకు నిర్ధారణ అయ్యిందని, దీంతో మీడియా ముందు ఆ వివరాలను వెల్లడించేందుకు సిద్ధమవుతుండగా, ఆ విషయం ఎలాగో జిల్లా కలెక్టర్ దృష్టికి వెళ్ళిందని, వెంటనే ఆయన యువకులు కల్తీసారా తాగి మృతి చెందలేదని హడావుడిగా ప్రకటన చేశారని గుర్తు చేశారు. కలెక్టర్ నిజం చెప్పి వుంటే .. ఎవరూ కల్తీసారా జోలికి వెళ్ళి ఉండేవారు కాదని, కలెక్టర్ ప్రకటన వారిని తప్పుదారి పట్టించిందని, చావింటికి వచ్చినవారంతా కల్తీసారా కోసం బారులు తీరటంతో పరిస్థితి దారుణంగా మారిందని ఆమె చెప్పారు.

కాగా కరుణాపురం, మాదవచ్చేరి ప్రాంతాల్లో ఆరోగ్యకార్యకర్తలు, నర్సులు ఇంటింటికీవెళ్లి తనిఖీ చేస్తున్నారు.



సామూహిక అంత్యక్రియల కోసం సిద్ధం చేసిన చితులు

మంత్రి ఉదయనిధి పరామర్శ

రాష్ట్ర యువజన సంక్షేమం, క్రీడాభివృద్ధి శాఖల మంత్రి ఉదయనిధి కళ్లకుర్చికి వెళ్ళి కల్తీసారా మృతుల కుటుంబీకులను పరామర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన విధంగా మృతుల కుటుంబీకులకు తలా రూ.10లక్షల చొప్పున ఆర్థిక సహాయం చెక్కులను అందజేశారు. చికిత్స పొందుతున్నవారికి రూ.50వేల చొప్పున ఆర్థిక సాయం అందించారు.



ఆస్పత్రిలో బాధితులను పరామర్శిస్తున్న ఉదయనిధి

సామూహిక అంత్యక్రియలు

కల్తీసారాకు బలైనవారిని ఒకే చోట అంత్యక్రియలు జరిపేందుకు తహసీల్దార్, రెవెన్యూ అధికారి సహా 29 మంది అధికారులను ప్రభుత్వం నియమించింది. మృతుల కుటుంబాల ఆచారారాల ప్రకారం మృతదేహాలకు అంత్యక్రియలు నిర్వహించేలా అధికారులు చర్యలు చేపట్టారు. గురువారం సాయంత్రం గోమతి వాగు ఒడ్డున కల్తీసారాకు బలైన 20 మంది మృతదేహాలకు సామూహిక ఖననం జరిపించారు. అదేవిధంగా మరికొన్ని మృతదేహాలను దహనం చేశారు. ప్రభుత్వం నియమించిన అధికారుల సమక్షంలో ఈ కార్యక్రమాలు జరిగాయి.



కళ్లకుర్చి ఆస్పత్రి వెలుపల మృతుల కుటుంబీకులు

త్వరలో 'వందే మెట్రో రైలు'



ఐసిఎఫ్‌లో తయారైన వందే మెట్రో రైలు



ఐసిఎఫ్, జూన్ 20: త్వరలో వందే మెట్రోరైలు నడపనున్నట్లు ఐసిఎఫ్ అధికారులు తెలిపారు. పెరంబూర్ ఐసిఎఫ్ కర్మాగారంలో తొలిసారిగా స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో తయారుచేసే వందే భారత్ రైళ్లకు మంచి స్పందన లభించింది. ఇదే సాంకేతికత వినియోగించిన మెట్రోరైలు రవాణా కోసం వందే మెట్రో రైలు తయారుచేశారు. తక్కువ దూరానికి వేగంగా వెళ్లేలా ఈ రైలు రూపొందించారు. ప్రస్తుతం తయారైన మొదటి రైలు ట్రయల్ రన్ నిర్వహించి ఒకటి, రెండు నెలల్లో నడపనున్నామని అధికారులు తెలిపారు.

రూ.10 కోట్లతో రెవెన్యూ శాఖకు 77 కొత్త వాహనాలు

● ప్రారంభించిన ముఖ్యమంత్రి స్టాలిన్

ప్యారీస్, జూన్ 20: ప్రభుత్వ రెవెన్యూ శాఖ కోసం రూ.10 కోట్లతో కొనుగోలు చేసిన 77 వాహనాలను ముఖ్యమంత్రి స్టాలిన్ పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. ప్రభుత్వానికి అధిక ఆదాయం సమకూర్చే శాఖల్లో రెవెన్యూ శాఖ వెన్నెముక వంటిది. ముఖ్యంగా భారీవర్షాలు, వరదలు, ప్రకృతి వైపరీత్యాలు సంభవించే సమయంలో ఈ శాఖ అధికారులు రేయింబవళ్లూ కష్టపడుతున్నారు. ఈ శాఖను అభివృద్ధి చేసేందుకు అన్ని వసతులతో కూడిన భవనాలు నిర్మించడంతో పాటు అధికారులకు గృహ సముదాయాలు, ఇంటర్నెట్ సేవలు, కార్యాలయ వినియోగం కోసం నూతన పరికరాలు, వాహనాలను ప్రభుత్వం సమకూరుస్తోంది. ఆ రీతిలో రూ.10 కోట్లతో కొనుగోలు చేసిన 77 కొత్త వాహనాల పంపిణీ కార్యక్రమం గురువారం ఉదయం సచివాలయం ప్రాంగణంలో రెవెన్యూ శాఖ మంత్రి కేకేఎస్ఎస్ఆర్ రామచంద్రన్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పాల్గొని, కొత్త వాహనాలను పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆ వాహనాల తాళాలను సంబంధిత అధికారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ నిర్వాహక కమిషనర్ ప్రభాకర్, కార్యదర్శి రాజారామన్, ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

కొత్త వాహనసేవలను పచ్చజెండా ఊపి ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్





బ్యానర్లు కడితే ప్రేక్షకులు వస్తారా ? అని కామెంట్స్ చేశారు

'మహారాజ' సక్సెస్ మీట్‌లో విజయ్ సేతుపతి

చిత్రజ్యోతి

తాను నటించిన పలు చిత్రాలు వరుసగా ఫెయిల్ కావడంతో 'మహారాజ' చిత్రానికి బ్యానర్లు కట్టినంత మాత్రాన ప్రేక్షకులు వస్తారా? అంటూ పలువురు కామెంట్స్ చేశారని, కానీ సినిమా విడుదలైన తర్వాత ప్రేక్షకులు ఘనవిజయం అందించారని విజయ్ సేతుపతి అన్నారు. ప్యాషన్ స్టూడియోస్ బ్యానరుతో కలిసి 'ది రూట్' కంపెనీ నిర్మించిన చిత్రం 'మహారాజ'. ఈ నెల 14న విడుదలై, మొదటి ఆట నుంచే అభిమానులు, ప్రేక్షకుల నుంచి భారీ స్పందనతో ప్రదర్శితమవుతుంది. వసూళ్ళపరంగా కూడా నిర్మాతలకు, పంపిణీదారులకు కాసుల వర్షం కురిపిస్తోంది. దీంతో చిత్ర బృందం బుధవారం థ్యాంక్స్ గివింగ్ మీట్ ఏర్పాటుచేసింది. ఇందులో హీరో విజయ్ సేతుపతి మాట్లాడుతూ, 'ఈ కథ వినిపించేటపుడు మంచి నమ్మకం కలిగింది. కానీ, ఇది ఎలా కార్యరూపం దాల్చుతుందన్న ప్రశ్నకూడా వచ్చింది. ఈ సినిమా కోసం నిర్మాత పెట్టిన పెట్టుబడి తిరిగి వచ్చేలా చేయాలన్న పట్టుదలతో పనిచేశాం. నేను నటించిన పలు చిత్రాలు వరుసగా నిరాశపరిచాయి. ఇపుడు 'మహారాజ'కు బ్యానర్లు కడితే విజయ్ సేతుపతి చిత్రానికి ప్రేక్షకులు వస్తారా? అనే కామెంట్స్ వినిపించాయి. ఇలాంటి వాటికన్నింటికీ ఈ చిత్రం సక్సెస్ సమాధానం చెప్పింది. ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు' అని పేర్కొన్నారు. దర్శకుడు నితిలన్ మాట్లాడుతూ, 'ఈ సినిమా విడుదలైన తర్వాత అనేక ప్రశంసిస్తూ ఫోన్లు చేస్తున్న వారందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఈ సినిమా సెట్స్‌పైకి తీసుకెళ్ళిన నిర్మాతకు ప్రత్యేక ధన్యవాదాలన్నారు. నటి మమతా మోహన్‌దాస్ మాట్లాడుతూ, 'ఈ సినిమాలో ఓ పాత్ర ఇచ్చినందుకు ధన్యవాదాలు. విజయ్ సేతుపతి 50వ చిత్రంలో భాగమైనందుకు సంతోషంగా ఉంది. మలయాళంలో కూడా మంచి ఆదరణ లభిస్తుంది. ఇటీవల కాలంలో తాను నటించిన చిత్రాలు ఈ స్థాయిలో ఏదీ ఆదరణకు నోచుకోలేదు. ఇంతటి ఘనవిజయాన్ని అందించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు' అని పేర్కొన్నారు. అలాగే, చిత్ర నిర్మాతలు సుధన్, కమల్ నయన్, శ్రీనివాసన్, నటులు మణికంఠన్, అరుళ్‌దాస్, వినోద్ తదితరులు ప్రసంగించారు.



'థ్యాంక్స్ గివింగ్ మీట్'లో చిత్ర బృందం



విజయ్ వెళ్ళడం వల్ల వచ్చే నష్టమేమీ లేదు

● నటి కస్తూరి

అగ్రహీరో విజయ్ రాజకీయాల్లోకి వెళ్ళడం వల్ల తమిళ చిత్రపరిశ్రమకు వచ్చిన నష్టమేమీ లేదని సీనియర్ నటి, భారతీయ జనతా పార్టీ మహిళా నేత కస్తూరి అభిప్రాయపడ్డారు. ఆమె తాజాగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో విజయ్ పొలిటికల్ ఎంట్రీపై స్పందించారు. 'హీరో విజయ్ నటనకు పూర్తిగా స్వస్తి పలికి రాజకీయాల్లోకి వెళ్ళడం వల్ల కోలీవుడ్‌కు వచ్చిన నష్టమేమీ లేదు. గత మూడు దశాబ్దాలుగా ఆయన చిత్రపరిశ్రమలో కొనసాగుతున్నారు. కానీ, సినిమా 150 యేళ్ళ క్రితమే తన ప్రయాణాన్ని ప్రారంభించింది. విజయ్ లేదా అమితాబ్ బచ్చన్ లేదా మరొకరో సినిమా పరిశ్రమకు దూరమైనప్పటికీ చిత్ర పరిశ్రమ మాత్రం తన ప్రయాణాన్ని ఎప్పటిలానే కొనసాగిస్తూనే ఉంటుంది' అని ఆమె అభిప్రాయపడ్డారు.

ఈ శతాబ్ది టాప్-25 చిత్రాల్లో 'కాలా'



'కాలా'లో రజనీకాంత్

బ్రిటీష్ ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన మాస పత్రిక సైట్ అండ్ సౌండ్ మ్యాగజైన్ ఈ శతాబ్దికి సంబంధించి టాప్-25 చిత్రాల జాబితా వెల్లడించింది. ఇందులో సూపర్‌స్టార్ రజనీకాంత్ నటించిన 'కాలా' చిత్రానికి చోటు లభించింది. 2018లో పా.రంజిత్ దర్శకత్వంలో వచ్చిన ఈ చిత్రంలో నానా పటేకర్, సముద్రఖని తదితరులు కీలక పాత్రల్లో నటించారు. ముంబై నగరంలోని ధారావి మురికివాడలో నివసించే తమిళ ప్రజల సమస్యలను ఇతివృత్తంగా చేసుకుని ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. విడుదలైన అన్ని భాషల్లో ప్రేక్షకులు బ్రహ్మారథంపట్టడంతో సూపర్ హిట్‌గా నిలిచింది. ఈ నేపథ్యంలో ప్రపంచ వ్యాప్తంగా ఈ శతాబ్దికి సంబంధించి సైట్ అండ్ సౌండ్ మ్యాగజైన్ విడుదల చేసిన టాప్-25 చిత్రాల జాబితాలో 'కాలా'కు చోటు దక్కడం ప్రతి ఒక్కరినీ ఆశ్చర్యానికి గురిచేస్తుంది. ఈ విషయం తెలుసుకున్న రజనీకాంత్ అభిమానులతో పాటు కోలీవుడ్ ప్రేక్షకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

'మాసాణి అమ్మన్'గా చెన్నై చంద్రం

కోలీవుడ్‌లో చెన్నై చంద్రంగా గుర్తింపు పొందిన హీరోయిన్ త్రిష కృష్ణన్.. వెండితెరపై 'మాసాణి అమ్మన్'గా కనిపించనున్నారు. ఆమె ప్రధాన పాత్రలో దర్శక నటుడు, ఆర్జే బాలాజీ ఈ చిత్రానికి ప్లాన్ చేశారు. 2020లో నయనతార ప్రధాన పాత్రలో 'మూక్కుత్తి అమ్మన్' చిత్రాన్ని ఆర్జే బాలాజీ తెరకెక్కించారు. కరోనా మహమ్మారి సమయంలో ఓటీటీలో విడుదలైన ఈ చిత్రం ఘనవిజయం సాధించి కనకవర్షం కురిపించింది. ఈ చిత్రం ద్వారా ఆర్జే బాలాజీ కూడా హీరోగా మారిపోయారు. ఇపుడు మళ్ళీ దర్శకత్వం వైపు దృష్టిసారించారు. ఇందుకోసం ఆయన మళ్ళీ అమ్మవారి స్టోరీనే ఎంచుకున్నారు. ఈ సినిమాకు 'మాసాణి అమ్మన్' పేరు ఖరారు చేసినట్టు సమాచారం. పైగా ఈ ప్రాజెక్టుకు సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ పనుల్లో ఆర్జే బాలాజీ నిమగ్నమైవున్నట్టు సమాచారం. ఇందులో హీరోయిన్ త్రిషను 'మాసాణి అమ్మన్'గా చూపించనున్నట్టు వార్తలు వినిపిస్తున్నాయి. ఈ ప్రాజెక్టు గురించి త్వరలోనే అధికారిక ప్రకటన వెలువడనుంది.



ఫ్రెషర్స్‌కు గ్రాండ్ వెల్‌కమ్... ఎస్కేపీసీలో విద్యార్థినుల సందడి



రోజాలతో నూతనోత్సాహం

ప్యారీస్, జూన్ 20: నగరంలోని కన్యకాపరమేశ్వరి మహిళా కళాశాల (ఎస్కేపీసీ)లో చేరిన విద్యార్థినులకు గురువారం ఘనస్వాగతం పలికారు. కళాశాల గౌరవ కరస్పాండెంట్ ఊటుకూరు శరత్‌కుమార్, ప్రిన్సిపల్ డాక్టర్ టీ. మోహనశ్రీ, డీన్ డాక్టర్ టీడీ వనిత, వైస్ ప్రిన్సిపాల్ ఎంవీ నప్పినై, ఎస్కేపీడీ సభ్యుడు దేసు లక్ష్మీనారాయణ, నాగం శ్రీకాంత్, కార్యదర్శి కిషోర్ తదితరులు విద్యార్థినులకు రోజా పూలు బహూకరించి శుభాకాంక్షలు తెలిపారు.



కొత్తగా చేరిన విద్యార్థినుల సందడి

వీఐటీ చెన్నై విద్యార్థుల ప్రతిభ



ద్వితీయ బహుమతి గెలుచుకున్న వీఐటీ చెన్నై జట్టు

ప్యారీస్, జూన్ 20: నార్వే దేశంలోని రోగాలాండ్‌లో ఉన్న టీఏయూ అటానమీ సెంటర్ నిర్వహించిన సముద్రం కింద రోబోట్లు నడిపే పోటీల్లో పాల్గొన్న చెన్నై వీఐటీ టీమ్ ద్వితీయ బహుమతి సొంతం చేసుకుంది. టీఏయూ అటానమీ సెంటర్‌లో ఈ నెల 10 నుంచి 14వ తేది వరకు సబ్‌సీ ఆయిల్ పైప్ లైన్ ఇన్‌స్పెక్షన్, ఆబ్జెక్ట్ ఐడెంటిఫికేషన్, వాల్వు ఆపరేషన్, ఫిట్టింగ్ స్టేషన్ అరైవల్ తదితర విభాగాల్లో పోటీలు నిర్వహించారు. ఇందులో 13 అంతర్జాతీయ విద్యాసంస్థలకు చెందిన 200 మంది విద్యార్థులు హాజరయ్యారు. వీఐటీ చెన్నైకి చెందిన 'ది డ్రెడ్ నాట్ రోబోటిక్స్' విద్యార్థి నాయకుడు హేమంత్ సహా 20 మంది బృందంతో డా.కరుణామూర్తి పాల్గొన్నారు. ఈ టోర్నీలో రెండో స్థానాన్ని చేజిక్కించుకున్న ఈ జట్టుకు నార్వేలోని భారత రాయబారి డా.అభినో విమల్, కాన్సులేట్ ఆఫీసర్ ప్రేమ్‌ప్రకాష్, టోర్నమెంట్ కో-ఆర్డినేటర్లు బహుమతి ప్రదానం చేసి ఘనంగా సత్కరించారు.